ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



అనకాపల్లి

జిల్లా వార్తలు

సోమవారం 1 ఏప్రిల్ 2024

విశాఖ దక్షిణ అభ్యర్థి వంశీకృష్ణ



- ఉత్కంఠకు తెరదించిన జనసేన అధిష్ఠానం

విశాఖపట్నం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విశాఖ దక్షిణ నియోజకవర్గానికి అభ్యర్థి ప్రకటనపై కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఇక్కడ నుంచి కూటమి అభ్యర్థిగా సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ టికెట్ ఖరారు చేశారు. ఈ మేరకు జనసేన రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ పేరున ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ, జనసేన ... మిగతా 6వ పేజీలో

ఢిల్లీ బోణీ



హోం గ్రౌండ్‌లో సత్తాచాటిన క్యాపిటల్స్ జట్టు

- చెన్నైపై 20 పరుగుల తేడాతో విజయం
- బ్యాటింగ్‌లో ప్రతిభ చూపిన కెప్టెన్ రిషబ్ పంత్
- వార్నర్, పృథ్వీషా మెరుపులు
- చివరి వరకు పోరాడిన ధోనీ



విశాఖపట్నం (స్పోర్ట్స్), మార్చి 31:

సిక్సర్లు, బౌండరీలతో ఏసీఏ వీడీసీఏ స్టేడియం హోరెత్తింది. ప్రేక్షకుల కేరింతలతో మార్మోగింది. హోం గ్రౌండ్‌లో ప్రేక్షకుల నుంచి కనీస ప్రోత్సాహం లభించకపోయినా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఈ సీజన్‌లో తొలి విజయాన్నందుకుంది. ఆదివారం పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య ఢిల్లీ క్యాపిటల్స్ 20 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌పై విజయం సాధించింది. ఆశించిన స్థాయిలో మ్యాచ్ ఆద్యంతం ఇరుజట్ల ఆటగాళ్లు ప్రేక్షకులకు ఐపీఎల్ మజాను అందించకపోయినా, ధోనీ బ్యాటింగ్‌కు దిగడంతో సగటు క్రీడాభిమానులు సంతృప్తి చెందారు. చివర్లో ధనా ధన్ బ్యాటింగ్‌తో ధోనీ మెరుపులు ప్రేక్షకులను ఆనందడోలికల్లో తేలించాయి.

పీఎం పాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియంను హోం గ్రౌండ్‌గా ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సభ్యులు బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించడంతో చెన్నైపై ఘన విజయం సాధించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆదిలో కొంచెం నెమ్మదిగా ఆడింది. మూడో ఓవర్‌లో చాహర్ బౌలింగ్‌లో డీప్ స్క్వేర్ లెగ్ మీదుగా డేవిడ్ వార్నర్ సిక్సర్ కొట్టడంతో ఊపు వచ్చింది. ఇక ఐదో ఓవర్‌లో వార్నర్ చెలరేగాడు. చాహర్ బౌలింగ్‌లో లాంగ్ లెగ్ మీదుగా సిక్సర్ బాది, తర్వాత బంతిని ఎక్స్‌ట్రా కవర్, పాయింట్ మీదుగా వరుసగా రెండు బౌండరీలు కొట్టి 14 పరుగులు ... మిగతా 5వ పేజీలో

ఘనంగా ఈస్టర్ సండే

జిల్లాలోని పలు చర్చిల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. గుడ్ ఫ్రైడే రోజు శిలువపై మరణించిన ఏసుక్రీస్తు మూడో రోజైన ఆదివారం పునరుత్థానం చెంది సమాధి నుంచి దర్శనమిస్తాడని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుటుంబ సభ్యుల సమాధుల వద్దకు వెళ్లి పూలు చల్లి, కొవ్వొత్తులు వెలిగించారు.



కోటవురట్లలో సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పిస్తున్న క్రైస్తవులు

చెరకు డబ్బులకు నిరీక్షణ

బకాయిల ఊసెత్తని ఫ్యాక్టరీ అధికారులు

- 2023-24 సీజన్‌లో లక్షా 71 వేల 601 టన్నుల చెరకు క్రషింగ్
- టన్నుకు రూ.2,919 చొప్పున రైతులకు రూ.50 కోట్లు బకాయిలు
- ఇంతవరకు 29,800 టన్నులకు రూ.2,500 చొప్పున రూ.7.45 కోట్లుమాత్రమే చెల్లింపు
- మూడు వారాల క్రితం ముగిసిన క్రషింగ్
- ఇంకా రూ.43 కోట్ల మేరకు రైతులకు బకాయిలు



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ

చోడవరం, మార్చి 31:

గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి 2023-24 క్రషింగ్ సీజన్‌లో చెరకు సరఫరా చేసిన రైతులు, బకాయిల చెల్లింపులు ఎప్పుడు జరుగుతాయా అని ఎదురుచూస్తున్నారు. ఈసారి చెరకు రైతులకు డబ్బులు త్వరగా చెల్లించేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు ప్రకటించి చాలా రోజులు అయినప్పటికీ అమలుకు నోచుకోలేదు. మొత్తం లక్షా 71 వేల 601 టన్నుల చెరకు క్రషింగ్ చేయగా, టన్నుకు రూ.2,919 చొప్పున సుమారు రూ.50 కోట్లు రైతులకు చెల్లించవలసి ఉంది. కానీ ఇంతవరకు 29,800 టన్నులకు రూ.2,500 చొప్పున సుమారు ఏడు కోట్ల 45 లక్షల రూపాయలు ఇచ్చారు. ఇంకా రూ.43 కోట్లకుపైగా రైతులకు చెల్లించాల్సి వుంది.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో 2023-24 సీజన్‌లో చెరకు క్రషింగ్ గత ఏడాది డిసెంబరు 15వ తేదీన ప్రారంభమైంది. చెరకు సరఫరా చేసే రైతులకు గత సీజన్‌లో మాదిరిగా కాకుండా ఈసారి త్వరగా పేమెంట్లు ఇవ్వడానికి ప్రయత్నిస్తామని సీజన్‌కు ముందు అధికారులు చెప్పారు. దీంతో చాలామంది రైతులు ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేశారు. గత ఏడాది బకాయిలు చేతికి రావడం ఆలస్యమైనప్పటికీ, ఫ్యాక్టరీ మూతపడకూడదన్న ఉద్దేశంతో రైతులు ఇతర ప్రైవేటు ఫ్యాక్టరీలకు చెరకు అమ్ముకోకుండా గోవాడ షుగర్స్‌కే చెరకు అందించారు. అయినప్పటికీ గత ఏడాది వర్షాభావ పరిస్థితులు, చెరకు సాగు విస్తీర్ణం తగ్గడంతో చెరకు సరఫరా తగ్గిపోయి క్రషింగ్ సీజన్‌ను మార్చి 13వ తేదీతోనే ముగించారు. మొత్తం లక్షా 71 వేల 601 టన్నుల చెరకు క్రషింగ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర, గత సీజన్‌లో వచ్చి పంచదార రికవరీ శాతాన్నిబట్టి టన్ను చెరకు ధరను రూ.2,919గా అధికారులు ప్రకటించారు. ఈ ప్రకారం లక్షా 71 వేల 601 టన్నులకు సుమారు రూ.50 కోట్లు రైతులకు చెల్లించాలి. అయితే సీజన్ ప్రారంభంలో చెరకు సరఫరా చేసిన కొద్దిమంది రైతులకు, అది కూడా టన్నుకు రూ.2,500 చొప్పున ఇచ్చారు. మిగిలిన రైతులకు ఇంతవరకు ఒక్క టన్ను చెరకుకు కూడా డబ్బులు చెల్లించలేదు.చెల్లించాల్సింది రూ. 50 కోట్లు

ఇచ్చింది గోరంత.. ఇవ్వాల్సి కొండంత

ఇటీవల ముగిసిన క్రషింగ్ సీజన్‌లో మొత్తం లక్షా 71వేల 601 టన్నుల చెరకు గానుగాడించారు. టన్నుకు రూ.2,919 చొప్పున రూ.50,09,03,319 రైతులకు చెల్లించాలి. కానీ క్రషింగ్ ప్రారంభమైన రోజు నుంచి ఈ ఏడాది జనవరి 15వ తేదీ వరకు చెరకు సరఫరా చేసిన 4,900 మంది రైతులకు చెందిన 29,800 టన్నులకు రూ.2,500 చొప్పున ... మిగతా 6వ పేజీలో

రెచ్చిపోయిన గ్రావెల్ మాఫియా

ఏపీఐఐసీ భూముల్లో అక్రమ తవ్వకాలు

- నిలదీసిన డిప్యూటీ జోనల్ మేనేజర్‌పై దాడి
- వచ్చినదారిన వెళ్లకపోతే పాతేస్తామని హెచ్చరిక
- పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారి
- ఐదుగురిపై కేసు నమోదు



ట్రాక్టర్‌లో గ్రావెల్ తరలిస్తున్న దృశ్యం

నక్కపల్లి, మార్చి 31:

గ్రావెల్ మాఫియా రెచ్చిపోయింది. ఏపీఐఐసీ భూముల్లో గ్రావెల్ ఎందుకు తవ్వుతున్నారంటూ ప్రశ్నించిన ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్‌పై అక్రమార్కులు దాడికి తెగబడ్డారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాలిలా వున్నాయి.



సంఘటన స్థలంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ డీవీ శ్రీనుబాబు

మండలంలోని అమలాపురం శివారు మూలపర్ర గ్రామానికి ఆనుకుని ఏపీఐఐసీ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నట్టు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు సమాచారం అందింది. దీంతో ఆయన డిప్యూటీ జోనల్ మేనేజర్ డీవీ శ్రీనుబాబును తనిఖీ నిమిత్తం ఆదివారం పంపారు. అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని శ్రీనుబాబు వెళ్లి పరిశీలించారు. అప్పటికే అక్కడ కొన్ని ట్రాక్టర్లు వున్నాయి. ఏపీఐఐసీ భూముల్లో గ్రావెల్ ఎందుకు తవ్వుతున్నారంటూ వారిని ప్రశ్నించారు. వారు ఎటువంటి సమాధానం చెప్పకపోగా డిప్యూటీ జోనల్ మేనేజర్‌ను దుర్భాషలాడుతూ 'నువ్వెవడివి మాకు చెప్పడానికి' అంటూ దౌర్జన్యం చేశారు. చొక్కా కాలర్‌పట్టుకుని కొట్టారు. దీంతో ఆయన ... మిగతా 6వ పేజీలో

ఆశలు అవుట్!

క్రమబద్ధీకరిస్తామని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పాదయాత్ర సమయంలో జగన్ హామీ

- అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం
- సీఎం తీరుపై ఉద్యోగుల మండిపాటు
- ఉమ్మడి జిల్లాలో పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సుమారు 30 వేల మంది ఉద్యోగులు



పాదయాత్రలో జగన్‌తో కలిసి నడుస్తున్న మణి, కాంట్రాక్టు ఉద్యోగులు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పాదయాత్ర సమయంలో హామీలనిచ్చి... అధికారంలోకి వచ్చిన తరువాత మరిచిపోయిన ముఖ్యమంత్రి జగన్ తీరుపై కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టులోకి తెస్తామని ఇచ్చిన హామీకి జగన్ మంగళం పాడేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న సుమారు 25 వేల మంది అవుట్ సోర్సింగ్, మరో ఐదు వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని మండిపడుతున్నారు.

ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీలతో ఆశలు పెట్టుకున్నామని, వేతనాలు పెరిగి జీవితాలు బాగుపడతాయని భావించామని, తీరా ఐదేళ్లు గడిచినా ఒక్కటి కూడా అమలుకాక ఇబ్బందులు పడుతున్నామని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు. జగన్ ఇచ్చిన హామీల అమలుకోసం ఐదేళ్లుగా నేతల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో దాదాపు 70 శాతం మంది ఆరోగ్యశాఖలో పనిచేస్తుండగా, మిగిలిన 30 శాతం మంది జీవీఎంసీ, ఫారెస్ట్, సమగ్ర శిక్ష అభియాన్, పశు సంవర్థక శాఖల్లో పనిచేస్తున్నారు.

హామీ అమలుకు మంగళం

సీఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేసి ఉంటే జిల్లాలో 30 వేల మందికిపైగా ఉద్యోగులకు మేలు జరిగేది. ప్రస్తుతం కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ... మిగతా 6వ పేజీలో

నమ్మించి మోసం చేశారు

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మేలు చేస్తామని ఇచ్చిన హామీని అమలుచేయకుండా నమ్మించి మోసం చేశారు. ఐదేళ్లుగా ప్రభుత్వ ప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది. ఉద్యోగులకు భద్రత, ఇతర బెనిఫిట్స్ అందిస్తామని ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారు. కేంద్ర పరిధిలోని స్కీమ్ అంటూ అడ్డగోలు వాదనను తెరపైకి తీసుకురావడం దారుణం. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 30 వేల మంది ఉద్యోగులకు ఈ ప్రభుత్వం అన్యాయం చేసింది.

- పి.మణి, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ

టిడ్కో కాలనీలో తాగునీటి కష్టాలు

నాలుగు మోటార్లలో పనిచేస్తున్నది ఒక్కటే!

- ఇది కూడా తరచూ మొరాయిస్తున్న వైనం
- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన



మోటారుకు మరమ్మతు పనుల్లో యువకులు

ఎలమంచిలి, మార్చి 31:

మునిసిపాలిటీ పరిధిలోని రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయంలో నివసిస్తున్న ప్రజలు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ఆరరంభంలోనే పరిస్థితి ఇంత తీవ్రంగా వుంటే... రానున్న రోజుల్లో సమస్య ఇంకెంత దారుణంగా వుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. తాగునీటి పథకం నిర్వహణ, నీటి సరఫరా విషయంలో ఇటు మునిసిపల్ అధికారులు, అటు టిడ్కో అధికారులు స్పందించక పోవడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామంటున్నారు.



టిడ్కో సముదాయం వద్ద పనిచేయని మోటారు

రామ్‌నగర్ సమీపంలో నిర్మించిన టిడ్కో కాలనీలో లబ్ధిదారులకు సుమారు ఎనిమిది నెలల క్రితం ఫ్లాట్‌లను పంపిణీ చేశారు. వీరిలో దాదాపు సగం మంది గృహప్రవేశాలు చేసి, కాలనీలోనే నివాసం ఉంటున్నారు. అప్పటి నుంచి కొన్ని ఫ్లాట్‌లకు నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతేకాక శ్లాబ్ లీకేజీలు, వంట గదుల్లోని వాడుక నీరు బయటకు పోయే మార్గాలు నిండిపోయి గ్రౌండ్ ఫ్లోర్‌లో నిలిచిపోవడం, విద్యుత్ వంటి సమస్యలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ సమస్యలను టిడ్కో అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా.. సిబ్బంది వచ్చి తాత్కాలిక మరమ్మత్తులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడంలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. కాగా వారం రోజుల నుంచి నీటి సమస్య ఆందోళన కలిగిస్తున్నది. కాలనీ ప్రజలకు నీటి అవరాలను తీర్చేందుకు నాలుగు మోటార్ల సహాయంతో ఇన్‌ఫిల్టర్ బావుల్లోకి నీటిని పంపింగ్ చేసి, అక్కడ నుంచి ఇళ్ల కాలనీపైన వున్న ట్యాంకులలోకి సరఫరా చేసేవారు. కానీ ఇటీవల మూడు మోటార్లు మరమ్మతుకు గురవడంతో ఉన్న ఒక్క మోటారుతోనే నెట్టుకొస్తున్నారు. ఇది కూడా రెండు రోజుల నుంచి పూర్తి స్థాయిలో పనిచేయడం లేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఈ విషయాన్ని టిడ్కో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. మోటారు తరచూ మరమ్మతుకు గురవుతుండడంతో దానిని బాగు చేయించేందుకు చేతి చమురు వదులుతున్నదని అంటున్నారు. వేసవి ఆరంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో తాగునీటి సమస్య ఇంకెంత తీవ్రంగా వుంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ)	6.14
సహరి (మంగళ)	4.37

కూటమి కోర్ కమిటీ సమావేశం



కోర్ కమిటీ సమావేశంలో పాల్గొన్న టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు, మూడు పార్టీల నాయకులు

- ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కార్యాలయంలో నిర్వహణ
- హాజరైన కూటమి అభ్యర్థులు, సీనియర్ నాయకులు

కొత్తూరు (అనకాపల్లి), మార్చి 31 :

పట్టణ శివారులో జాతీయ రహదారి వద్ద ఉన్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కార్యాలయంలో ఆదివారం కోర్ కమిటీ సమావేశం జరిగింది. అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎన్నికల ప్రచారం, నియోజకవర్గాల్లో సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, దాడి వీరభద్రరావు, అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ఎలమంచిలి జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్, పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు, మాడుగుల టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు, ఆయా పార్టీల నాయకు ప్రగడ నాగేశ్వరరావు, గెడ్డం బుజ్జి, ఈర్లె శ్రీరామమూర్తి, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ సందడి



దీపక్ చాహర్ బౌలింగ్





రవీంద్ర జడేజా



టాస్ వేస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషబ్‌పంత్, చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్



గాల్లో క్యాచ్ పడుతున్న పతిరాణా



వికెట్ తీసిన ఆనందంలో చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు



ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆటగాడు డేవిడ్ వార్నర్ బ్యాటింగ్



వికెట్ తీసిన ఆనందంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు



స్టేడియంలో చీర్ గాళ్స్ సందడి

పీఎం పాలెం ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్‌కింగ్స్ జట్ల మధ్య జరిగిన టీ 20 రసవత్తరంగా సాగింది. ఆది నుంచీ ధోనీ అభిమానులతో స్టేడియంలో సందడి నెలకొంది. పసుపు జెర్సీలను ధరించిన అభిమానులు కేవలం ధోనీ బ్యాటింగ్ కోసమే స్టేడియంకు వచ్చామా అన్నట్టుగా ఎదురుచూశారు. తొలి రెండు మ్యాచ్‌లలో బ్యాటింగ్ చేయని ధోనీ విశాఖలో బ్యాటింగ్‌కు రావడంతో కేరింతలు కొట్టారు. చెన్నై ఓడిపోయినా ధోనీ బ్యాటింగ్ చూసినందుకు సంబరాలు చేసుకున్నారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



జాతీయ పతాకంతో క్రికెట్ అభిమానులు

ఢిల్లీ బోణీ

... 3వ పేజీ తరువాయి

రాబట్టాడు. ఈ స్థితిలో ఢిల్లీ క్యాపిటల్స్ 5.2 ఓవర్లలో 50 పరుగులు చేసింది. ఆరో ఓవర్‌లో మరో ఓపెనర్ పృధ్వీ షా బ్యాట్ ఝుళిపించాడు. ముస్తఫిజర్ బౌలింగ్‌లో షార్ట్ ఫైన్ లెగ్, ఫైన్ లెగ్, థర్డ్ మ్యాన్ మీదుగా వరుస బౌండరీలు బాదాడు. మ్యాచ్ ఏడో ఓవర్‌లో రవీంద్ర జడేజా బౌలింగ్‌కు వచ్చాడు. జడేజా వేసిన రెండో బంతిని పృధ్వీ షా మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ కొట్టగా, నాల్గో బంతిని డేవిడ్ వార్నర్ స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీకి తరలించాడు. 33 బంతుల్లో మూడు సిక్సర్లు, ఐదు బౌండరీలతో హాఫ్ సెంచరీ (51) పూర్తి చేసిన డేవిడ్ వార్నర్, పదో ఓవర్‌లో ముస్తఫిజర్ బౌలింగ్‌లో పతిరానా గాలిలో అద్భుతమైన క్యాచ్ పట్టడంతో అవుటయ్యాడు. తర్వాత ఓవర్‌లో 27 బంతుల్లో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో 43 పరుగులు చేసిన పృధ్వీ షా, జడేజా బౌలింగ్ స్టంపౌట్ అయ్యాడు. 10.3 ఓవర్లలో ఢిల్లీ క్యాపిటల్స్, వంద పరుగులు పూర్తి చేసింది. వరుసగా వికెట్లు పడిపోయి స్కోరు మందగించిన సమయంలో 13వ ఓవర్‌లో జడేజా బౌలింగ్‌లో మిడ్ వికెట్ మీదుగా పంత్ భారీ సిక్సర్ కొట్టాడు. పతిరాణా బౌలింగ్‌లో స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీ కొట్టిన మార్ష్ (18), తర్వాత బంతికి క్లీన్ బౌల్డ్ కాగా, మార్ష్ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన స్టబ్స్ (0) పరుగులేమీ చేయకుండానే అవుటయ్యాడు. కాగా 18వ ఓవర్‌లో రిషబ్ పంత్ చెలరేగాడు. పతిరాణా బౌలింగ్‌లో లాంగ్ ఆన్ మీదుగా సిక్సర్, బౌండరీ, పాయింట్ మీదుగా మరో బౌండరీ కొట్టి ప్రేక్షకులను ఉత్సాహపరిచి (50), 31 బంతుల్లో నాలుగు బౌండరీలు, సిక్సర్లతో అర్ధ సెంచరీ పూర్తి చేసి ఐదో వికెట్‌గా పెవిలియన్‌కు చేరాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 191 పరుగులు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్ తుది జట్టులో లోకల్ బాయ్‌కు రిక్కీబుయ్‌కు చోటు దక్కలేదు. లక్ష్య ఛేదనలో చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 171 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఏడు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన దశలో రహానే (45), మిచెల్ (34) జట్టును ఆదుకున్నారు. దుబే (18) కొద్ది సేపు మెరిశాడు. వరుసగా వికెట్లు పడిపోయిన దశలో ధోనీ బ్యాటింగ్‌కు దిగడంతో ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. మూడు సిక్సర్లు, ఒక బౌండరీతో 37 పరుగులు చేసిన ధోనీకి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్ రెండు, ముకేష్‌కుమార్ మూడు వికెట్లు పడగొట్టారు.

ధోనీకి ప్రేక్షకుల అరుదైన గౌరవం

ఎనిమిదో నంబరు బ్యాట్స్‌మన్‌గా గ్రౌండ్‌లోకి వచ్చిన ధోనీకి...గ్యాలరీలోని ప్రేక్షకులంతా లేచి నిలబడి కేరింతలతో స్వాగతం పలికారు. ఈ సీజన్‌లో తొలి సారి బ్యాటింగ్ చేసిన ధోనీ... తాను ఎదుర్కొన్న తొలి బంతిని బౌండరీకి తరలించడంతో స్టేడియం హోరెత్తింది. రెండో బంతికి అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అదే ఓవర్‌లో మరో బౌండరీ కొట్టడంతో ప్రేక్షకులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. అతను బ్యాటింగ్ చేస్తున్నంతసేపు ప్రేక్షకులు ధోనీ...ధోనీ అంటూ నినాదాలతో స్టేడియం మారుమ్రోగింది.



అత్యధిక సిక్స్‌లు కొట్టినందుకు అవార్డు అందుకుంటున్న ధోనీ

ఇదిలా ఉండగా చెన్నై సూపర్ కింగ్స్ విజయం కన్నా...ధోనీ బ్యాటింగ్ చేయాలని ప్రేక్షకులు కోరుకోవడం విశేషం. చెన్నై సూపర్ కింగ్స్ వరుసగా వికెట్లు పడిపోతూ ఓటమి దిశగా సాగుతున్నా ప్రేక్షకుల పట్టించుకోలేదు. ఒక రకంగా చెప్పాలంటే వికెట్ పడుతున్న ప్రతిసారి ధోనీ బ్యాటింగ్‌కు వస్తాడనే ఆసక్తి వారిలో కినిపించింది. దుబే ఆరో వికెట్‌గా అవుటైన తర్వాత ధోనీ బ్యాటింగ్‌కు రావడంతో స్టేడియంలోని ప్రేక్షకులు హుషారుతో సంబరాలు చేసుకున్నారు. ధోనీ క్రీజులో ఉన్నంతసేపు కేరింతలు కొడుతూనే ఉన్నారు. మ్యాచ్ ముగిసిన తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ ఓడిపోయినా ధోనీ బ్యాటింగ్ చూశామనే ఆనందంతో ప్రేక్షకులు ఇంటి ముఖం పట్టారు.

సీఎస్‌కే జెర్సీలతో స్టేడియం పసుపు మయం

▸▸ హోం గ్రౌండ్‌లో కనిపించని ఢిల్లీ క్యాపిటల్స్ జెర్సీలు

విశాఖపట్నం (స్పోర్ట్సు) / మధురవాడ, మార్చి 31 : మ్యాచ్‌లో క్రీడాభిమానుల సందడి నెలకొంది. స్టేడియంలోని గ్యాలరీలన్నీ సీఎస్‌కే జెర్సీలతో నిండిపోయి పసుపుమయంగా మారాయి. 90 శాతం వరకు సీఎస్‌కే జెర్సీల పేరుతో ఉన్నవే కనిపించాయి. హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రేక్షకుల నుంచి ఆశించిన ప్రోత్సాహం దక్కలేదు. స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన బ్లూ అండ్ రెడ్ కలర్ జెర్సీలు ధరించిన ప్రేక్షకులు అతి తక్కువ మంది మాత్రమే కనిపించారు. అలాగే మ్యాచ్‌కు ముందు సీఎస్‌కే, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు వార్మప్ చేయడానికి వచ్చారు. కొద్ది సమయం తర్వాత ధోనీ గ్రౌండ్‌లో అడుగుపెట్టిన వెంటనే ప్రేక్షకుల కేరింతలు కొట్టారు. ధోనీ కొద్దిసేపు వార్మర్ చేసి తిరిగి డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయాడు. మరోవైపు స్టేడియానికి వెళ్లే మార్గంతో చెన్నై సూపర్ కింగ్స్ పసుపు రంగు జెర్సీల అమ్మకాలు జోరుగా జరిగాయి. దారి పొడుగునా సీఎస్‌కే జెర్సీలు, క్యాప్స్, ఫ్లాగ్స్ స్టాల్స్ కనిపించాయి. మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే ప్రేక్షకులు ధోనీ పేరుతో ఉన్న జెర్సీలు కొని, అక్కడే వేసుకుని స్టేడియానికి వెళ్లడంతో మార్గమంతా పసుపుమయంగా మారింది.

నగరానికి చేరుకున్న 'కోల్‌కతా నైట్ రైడర్స్'



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న జట్టు సభ్యులు

గోపాలపట్నం, మార్చి 31: పీఎంపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఏప్రిల్ మూడున జరగనున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొనేందుకు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు సభ్యులు నగరానికి చేరుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి విమానంలో విశాఖ చేరుకున్న వారికి క్రీడాభిమానులు స్వాగతం పలికారు. అనంతరం జట్టు సభ్యులు రోడ్డు మార్గం గుండా హోటల్ నోవాటెల్‌కు చేరుకున్నారు.

క్రైం... crime news

వెంకన్నపాలెంలో చోరీ

▸▸ 100 గ్రాముల బంగారం అపహరణ

మాకవరపాలెం, మార్చి 31: మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో ఓ ఇంట్లో శని వారం చోరీ జరిగింది. 100 గ్రాముల బంగారం అపహరణకు గురైంది. దీనికి సంబంధించి ఎస్‌ఐ రామకృష్ణారావు ఆది వారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని వెంకన్నపాలెం గ్రామానికి చెందిన రెడ్డి శ్రీను శుక్రవారం బంధువుల వివాహానికి పరవాడ మండలం తానాం వెళ్లారు. శనివారం రాత్రి 7 గంటలకు తిరిగి ఇంటికి వచ్చే సరికి తలుపులు తీసి ఉన్నాయి. బీరువాలోని దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని 100 గ్రాముల బంగారం అపహరణకు గురైనట్టు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ హరి, ఎస్‌ఐ రామకృష్ణారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

కశింకోట, మార్చి 31: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కన్నూరుపాలెం వద్ద ఆదివారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి సీఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలివి. కచ్చర్లపాలెం ప్రాంతానికి చెందిన ఆరపురెడ్డి పవన్(19) లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై తాళ్ళపాలెం వైపు వెళుతుండగా అనకాపల్లి నుంచి నర్సీపట్నం వస్తున్న ఆర్టీసీ బస్సు కన్నూరుపాలెం వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో పవన్ అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడి అన్నయ్య ఆరపురెడ్డి సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

వీఆర్‌వో విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు

కొత్తూరు, మార్చి 31 : మండలంలోని గోపాలపురం వీఆర్‌వోగా పని చేస్తున్న వంతల వినోద్ విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ జి.తేజేశ్వరరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆదివారం ఆయన తెలిపిన వివరాలివి. శనివారం సాయంత్రం వీఆర్‌వో వినోద్ తన సిబ్బందితో గోపాలపురం గ్రామంలో ఉన్న కొండ పోరంబోకు స్థలాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు వెళ్లారు. అయితే అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తన విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఆ ముగ్గురు వ్యక్తుల వివరాలు ఎస్‌ఐ వెల్లడించలేదు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఎస్.రాయవరం, మార్చి 31: మనస్తాపంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి ఎస్‌ఐ విభీషణరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన కారె ఇస్సాక్(25)ను ఓ యువతి విషయంపై అదే గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు తరచూ బెదిరిస్తున్నారు. ఆదివారం కూడా ఇస్సాక్‌ను ఆ కుటుంబ సభ్యులు బెదిరించడంతో మనస్తాపం చెందిన ఆ యువకుడు పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న ఇస్సాక్ కుటుంబ సభ్యులు వెంటనే నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆ యువకుడు మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.



కారె ఇస్సాక్ (ఫైల్ ఫొటో)

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

కేసీఆర్‌కు పట్టిన గతే జగన్‌కు..

▸▸ కూటమి గెలిస్తే ముఖ్యమంత్రి అవినీతి సొమ్మును కక్కించి ప్రజలకు పంచిపెడతాం

▸▸ సకాలంలో పింఛన్లు పంపిణీ చేయకపోతే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

▸▸ బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్



ప్రసంగిస్తున్న బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

సబ్బవరం, మార్చి 31: తెలంగాణలో కేసీఆర్‌కు పట్టిన గతే ఆంధ్రాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి పట్టనుందని బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. మండలంలోని అసకపల్లి గ్రామంలో సర్పంచ్ కర్రి నర్సింగరావు ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఆయన అనుచరులు పలువురు జనసేన పార్టీలో చేరారు. వారికి సీఎం రమేశ్, పంచకర్ల పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం సీఎం రమేశ్ మాట్లాడుతూ తెలంగాణలో కేసీఆర్ ఓడిపోయిన తరువాత ఆ పార్టీ ఖాళీ అయిందని, అదే గతి ఇక్కడ జగన్‌కు పట్టనుందన్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మంత్రిగా, డిప్యూటీ సీఎంగా ఈ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. ఆయన ఎంపీగా గెలిస్తే నేరుగా ఢిల్లీకి వెళ్లే సత్తా లేదని, ఏ రెడ్డినో వెంట పెట్టుకొని వెళ్లడం తప్ప చేయగలిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కూటమి గెలిస్తే ముఖ్యమంత్రి అవినీతి సొమ్మంతా కక్కించి ప్రజలకు పంచిపెడతామన్నారు. రాష్ట్రంలో పింఛన్లు ఇవ్వకుండా చేసి ఆ నెపం టీడీపీపై నెట్టే ప్రయత్నం జరుగుతోందని, సచివాలయ సిబ్బందితో సకాలంలో పింఛన్లు పంపిణీ చేసే ఏర్పాట్లు అధికారులు చేయాలని, లేకుంటే ఈసీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. బూడి ఎంపీగా గెలిస్తే కేంద్రంలో ఎవరికి సపోర్టు చేస్తారో ఆయన గానీ, వాళ్ల ముఖ్యమంత్రికి గానీ చెప్పే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. ఎంపీగా తనను గెలిపిస్తే ఈ ప్రాంతానికి పరిశ్రమలు, యువతకు విద్య, ఉపాధి అవకాశాల కోసం కృషి చేస్తానన్నారు. ఎంపీగా తనకు కమలం గుర్తుపైన, ఎమ్మెల్యేగా పంచకర్లకు గ్లాసు గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. పంచకర్ల మాట్లాడుతూ దమ్ము, ఖలేజా ఉన్న నాయకుడికి ప్రాంతంతో సంబంధం లేదన్నారు. ఢిల్లీలో చక్రం తిప్పగల సత్తా కలిగిన మంచి మనసున్న నాయకుడు సీఎం రమేశ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి గొర్లి రామునాయుడు, జనసేన నేతలు పంచకర్ల వెంకటేశ్వరరావు, ఇందలి వెంకటరమణ, బీపీ రావు, గండి దుర్గాప్రసాద్, కర్రి కనకరాజు, పలువురు జనసైనికులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైసీపీకి భీమిలి జడ్పీటీసీ సభ్యుడు రాజీనామా

▸▸ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్టు ప్రకటన



మాట్లాడుతున్న వెంకటప్పడు

భీమునిపట్నం రూరల్, మార్చి 31: విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు తన పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. అతనితో పాటు మరికొంతమంది నేతలు కూడా తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం తగరపువలసలో నిర్వహించిన సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు మాట్లాడుతూ ధర్మం వైపు నిలబడాలనే ఉద్దేశంతో వైసీపీకి రాజీనామా చేస్తున్నామన్నారు. వైసీపీలో కక్షసాధింపులు తప్ప అభివృద్ధి లేదని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళా తీయడంతో నిరుద్యోగం పెరిగిపోయిందని, వాటికి నిరసనగా పార్టీ నుంచి వైదొలగుతున్నామన్నారు. వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలిచినందున జడ్పీటీసీ పదవికి కూడా సంబంధిత నమూనాలో రాజీనామా చేసి, జిల్లా పరిషత్ సీఈవోకు పంపిస్తున్నామన్నారు. జడ్పీటీసీ సభ్యుడితో పాటు మండలంలోని సింగనబంద సర్పంచి జీవీ నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తుపాకుల పైడిరాజు, పీఏసీఎస్ డైరెక్టరు గాడు తాతినాయుడు, వివిధ పంచాయతీల ఉప సర్పంచులు బుద్దరాజు సత్యనారాయణరాజు, నీలాపు అనసూయ, భుక్త రమావతి, ఎనిమిది పంచాయతీలకు చెందిన 32 మంది వార్డుసభ్యులు, సచివాలయ కన్వీనర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

జనసేనలో వైసీపీ సర్పంచ్, మాజీ సర్పంచుల చేరిక



సుందరపు సమక్షంలో జనసేన పార్టీలో చేరిన మామిడివాడ వైసీపీ సర్పంచ్ మట్ట అప్పలనర్సమ్మ, వైసీపీ మాజీ సర్పంచులు

రాంబిల్లి, మార్చి 31: మండలంలోని మామిడివాడ పంచాయతీకి చెందిన వైసీపీ ప్రస్తుత సర్పంచ్ మాట్టా అప్పలనర్సమ్మ, మాజీ సర్పంచులు బొడ్డేడ భాస్కరరావు, చందర సూరిబాబు, మాజీ వార్డు సభ్యులు చుక్కా నల్లమారి, పార్టీ సీనియర్ నాయకులు ఆడారి పరమేశ్వరరావులు తమ అనుచరులతో ఆదివారం హరిపురం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎలమంచిలి అసెంబ్లీ అభ్యర్థి సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారికి విజయకుమార్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు కనీస నిధులు ఇవ్వకపోవడంతో సర్పంచులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు సర్పంచులకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాంబిల్లి, అచ్యుతాపురం మండలశాఖ అధ్యక్షులు పప్పల నూకన్నదొర, బైలపూడి రామదాసు, మాజీ జడ్పీటీసీ సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, ఉరిటి నానాజీ పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

దిబ్బపాలెంలో భారీగా చేరిక

అచ్యుతాపురం: సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం పంచాయతీ) వైసీపీ నుంచి ఆదివారం భారీగా జనసేనలోకి చేరారు. దిబ్బపాలెం మాజీ ఎంపీటీసీ సభ్యుడు తుమ్మల రాజు తన అనుచరులతో జనసేనలో చేరారు. అలాగే చిప్పాడలో కూడా పలువురు వైసీపీ నాయకులు జనసేనలో చేరారు. వీరందరికి ఉమ్మడి అభ్యర్థి సుందరపు విజయకుమార్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో బైలపూడి శ్రీరామదాసు, జనసరెడ్డి శ్రీనివాసరావు, పల్లి రామునాయుడు, తుమ్మల సుధ, ముప్పిడి రవి, పుణ్యమంతుల సత్తిబాబు, కూనిశెట్టి రవి, అందె చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో నూకాంబిక ఆలయం కిటకిట



బాలాలయంలో నూకాంబికను దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి టౌన్, మార్చి 31: ఉత్తరాంధ్రలోని ప్రఖ్యాతిగాంచిన స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున బాలాలయంలో అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజాము నుంచే ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని భక్తులు కుటుంబసమేతంగా అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. మధ్యాహ్నం మూడు గంటలు దాటినా ఆలయంలో భక్తుల సందడి తగ్గలేదు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ కాటేజీలు, పరిసర ప్రాంతాల్లో వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

రారెత్తిస్తున్న ఎండలు

▸▸ అనకాపల్లిలో 36.8 డిగ్రీల ఉష్ణోగ్రత

అనకాపల్లి టౌన్, మార్చి 31: అనకాపల్లి పట్టణంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఆదివారం అత్యధిక ఉష్ణోగ్రత 36.8 డిగ్రీలు, అత్యల్ప ఉష్ణోగ్రత 23.0 డిగ్రీలుగా నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఉదయం నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఎండ వేడికి వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

పార్లమెంట్ నియోజకవర్గ వైసీపీ పరిశీలకురాలిగా ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్, మార్చి 31: వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులిగా ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి నియమితులయ్యారు. పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం లేఖ పంపినట్టు ఎంపీ కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు లేఖను విడుదల చేశారు.

సచివాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం, మార్చి 31: విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో మండలంలోని 11 సచివాలయాలకు విద్యుత్ శాఖ అధికారులు సరఫరాను నిలిపివేశారు. మండలంలో పెదపాడు, ఖాజీపాలెం, జగ్గన్నపేట, తిమ్మరాజుపేట, కొండకర్ల, వెదురువాడ, గొర్లె ధర్మవరం, చోడపల్లి, భోగాపురం సచివాలయాలకు ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

అనకాపల్లి నియోజకవర్గం

కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి టౌన్, మార్చి 31 : ఇక్కడి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాకుళం శ్రీచక్ర రాజేశ్వరిదేవి ఆశ్రమ పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కర్ శర్మతో పాటు పెద్ద సంఖ్యల భక్తులు దర్శించుకున్నారు. మండపంలో కుంకుమ పూజలతో పాటు, లలితా సహస్రనామస్తోత్రం పఠించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో- ఛైర్మన్ డాక్టర్ గ్రంథి శేషకుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పిళ్లావారి వీధిలో నూకాంబిక పండగ



అనకాపల్లి టౌన్, మార్చి 31 : పట్టణంలోని పిళ్లా వారి వీధి కుటుంబాలు ఆదివారం నూకాంబిక అమ్మవారి పండగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఘటాలను తలపై పెట్టుకుని పురవీధుల గుండా ఊరేగి అమ్మవారి బాలాలయానికి చేరుకుని సమర్పించారు. టీడీపీ నాయకులు దాడి రత్నాకర్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు ఆడారి రవికుమార్, కాండ్రేగుల జగదీష్, పిళ్లా తారకేసు, లగుడు రాజేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అనకాపల్లి టౌన్, మార్చి 31 : గవరపాలెం నిదానందొడ్డిలోని సత్యసాయి సేవా సమితి మందిరం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర పుష్పగిరి ఐ ఆస్పత్రి సిబ్బంది డబ్బై మందికి కంటి పరీక్షలు జరిపారు. సంజీవిని మల్టీ స్పెషల్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు పలువురికి పరీక్షలు చేపట్టారు. న్యాయవాది సీహెచ్.రామచంద్ర, దాడి నాగేశ్వరరావు, మళ్ల స్వామి, కొణతాల సూర్య, సమితి సభ్యులు పాల్గొన్నారు.

పాలీసెట్‌కు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ నారాయణరావు

అనకాపల్లి టౌన్, మార్చి 31 : పౌర్ణమి సేవా సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలు రాసి విద్యార్థులకు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్టుకు సంబంధించి ఉచిత శిక్షణను ఆదివారం ప్రారంభించామని సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు తెలిపారు. ఏప్రిల్ 27వ తేదీ వరకు ఈ తరగతులు కొనసాగుతాయన్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ విభాగాల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ఇక్కడి కళ్యాణి నర్సింగ్‌హోమ్ మేడపై గల హాల్‌లో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పౌర్ణమి సేవా సంస్థ అధ్యక్షుడు బుద్ద సోమేశ్వరరావు, కార్యదర్శి బొడ్డేడ కాశీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమిని గెలిపిస్తే గంజాయిపై ఉక్కుపాదం

- వైసీపీ పాలనలో రాష్ట్రంలో అరాచకాలు
- యువత భవిష్యత్తు చిత్తు
- టీడీపీ, జనసేన, బీజేపీ అధికారంలోకి వస్తేనే ఆంధ్రప్రదేశ్‌కు మంచిరోజులు
- కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమంలో కొణతాల రామకృష్ణ



వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరిన వారితో కొణతాల రామకృష్ణ తదితరులు

కొత్తూరు, మార్చి 31 : వైసీపీ పాలనలో గంజాయి, బెట్టింగ్ వంటి వాటికి యువత అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అనకాపల్లి నియోజకవర్గం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. 80వ వార్డు పరిధి గవరపాలెం చినరామస్వామి ఆలయ సమీపంలో ఉన్న కోనాందిబ్బ వద్ద ఆదివారం కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నిర్వాకం వల్ల పలువురు యువత డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. బెట్టింగులకు బానిసలు అవుతున్నారన్న విషయాన్ని స్థానిక యువకులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో ఈ అరాచకాలన్నీ పోవాలంటే కూటమి అభ్యర్థులు గెలిస్తేనే సాధ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వం అండదండలతోనే గంజాయి రవాణా జరుగుతోందని కొణతాల ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే వీటిపై నిర్దిష్టమైన కార్యక్రమాన్ని నిర్వహించి, పక్కాగా అరికట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ కుమారుడు రిత్విక్ మాట్లాడుతూ యువతరానికి బహుళ పరిశ్రమలు తీసుకొచ్చి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు బీఎస్ఎంకే జోగినాయుడు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బొడ్డేడ మురళి, కర్రి మల్లేశ్వరరావు, కాండ్రేగుల రాజు, సూరిశెట్టి రాము, మళ్ళ శ్రీను, మారిశెట్టి భాస్కరరావు పాల్గొన్నారు.

ఇదిలావుంటే, వైసీపీకి మరోషాక్ తగిలింది. అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం ప్రాంతానికి చెందిన 250 మంది యువకులు వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరారు. మళ్ళ జగన్నాథం కళ్యాణ మండపంలోజరిగిన సమావేశానికి అనకాపల్లి నియోజకవర్గ అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, ఉమ్మడి పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేశ్ తనయుడు రిత్విక్ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి జనసేనలోకి చేరిన యువకులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముందుగా ప్రభాస్ ఫ్యాన్స్ అధినేత కాండ్రేగుల జోగేంద్ర ఆధ్వర్యంలో అనకాపల్లి పురవీధుల్లో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కొణతాల రామకృష్ణ స్వయంగా వాహనం నడిపి కార్యకర్తలను ఉత్తేజపరిచారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, కాండ్రేగుల సునీల్, దొడ్డి శ్రీను, పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమి విజయం తథ్యం : గండి బాబ్జీ



విశాఖ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు బాబ్జిని సత్కరిస్తున్న నాయకులు

సబ్బవరం, మార్చి 31 : సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి విజయం తథ్యమని విశాఖ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జి అన్నారు. పార్లమెంట్ అధ్యక్ష పదవి చేపట్టిన సందర్భంగా పలువురు పార్టీ నాయకులు ఆదివారం ఆయనను స్వగ్రామం మొగలిపురంలో కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి, సత్కరించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గంతో పాటు విశాఖ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. నాయకులు భరణికాన బాబూరావు, ఎం.మహాలక్ష్మినాయుడు, బాదిరెడ్డి లక్ష్మణ, పైడింనాయుడు, పల్ల తాతారావు, గవరి సత్యనారాయణ, రామకృష్ణరాజు, పడాల శ్రీను, రొంగలి దేముడు, కొరాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ అభ్యర్థి వంశీకృష్ణ

... 3వ పేజీ తరువాయి

బీజేపీ కూటమి మధ్య సీట్ల అవగాహన మేరకు దక్షిణ నియోజకవర్గం జనసేనకు కేటాయించడంతో వంశీకృష్ణ పోటీచేస్తారని తొలుత ప్రకటించారు. అయితే ఇటీవల రాష్ట్రంలో జనసేన పోటీచేసే 21 స్థానాలకు గాను 18 మంది అభ్యర్థులతో విడుదల చేసిన జాబితాలో వంశీ పేరు లేక పోవడంతో ఉత్కంఠ నెలకొంది. అయితే ఆదివారం పిఠాపురంలో ఉన్న పవన్ కల్యాణ్ పార్టీ ముఖ్యనేతలతో చర్చించి, దక్షిణ టికెట్‌ను వంశీకి ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి అభ్యర్థులను ప్రకటించినట్టయింది.

ఆశలు అవుట్!

... 3వ పేజీ తరువాయి

ఉద్యోగులకు రూ.18 వేల నుంచి రూ.38 వేల వరకు వేతనం లభిస్తోంది. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి ఉంటే.. రెగ్యులర్ ఉద్యోగులకు లభించే వేతనం దక్కేది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ.24 వేలు చెల్లిస్తు న్నారు. కనీస వేతనాల హామీ అమలైతే రూ.30 వేలకుపైగా లభించేదని చెబుతున్నారు. అదే సమయంలో ఈ రెండు కేటగిరీల్లో ఉద్యోగ భద్రత ఉండేదంటున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలయ్యేదని పేర్కొంటున్నారు.

కేంద్ర పథకమంటూ దాటవేత

కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని అమలుచేయాలని ఉద్యోగులు కోరితే.. ప్రభుత్వ పెద్దలు భిన్నమైన వాదనను తెరపైకి తీసుకు వచ్చారని చెబుతున్నారు. సమగ్ర శిక్ష అభియాన్, నేషనల్ హెల్త్ మిషన్ వంటి స్కీమ్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుచేస్తున్నాయని, వీటిలో పనిచేసే వారిని రెగ్యులరైజ్ చేయలేమని ప్రభుత్వం స్పష్టం చేసిందంటున్నారు. పాదయాత్ర సమయంలో ఈ అంశాలపై జగన్‌కు అవగాహన ఉన్నప్పటికీ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత మాట మారుస్తున్నారని ఉద్యోగులు మండిపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అమలుచేస్తున్న పథకాల్లోనే సుమారు నాలుగు వేల మంది వరకు కాంట్రాక్టు ఉద్యోగులున్నారని, వారందరినీ మభ్య పెట్టి.. ఈ తరహా వ్యాఖ్యలు చేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రెచ్చిపోయిన గ్రావెల్ మాఫియా

... 3వ పేజీ తరువాయి



గ్రావెల్ తవ్విన ప్రదేశం

పోలీసు స్టేషన్‌కు వెళ్లి.. పుణ్యమంతుల సంజీవి, యలమంచిలి దుర్గాప్రసాద్, మనబాల గణేశ్, పిక్కి బుజ్జి, రావి రాజులు తనపై దాడిచేసినట్టు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ విజయ్‌కుమార్ వీరిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రీనుబాబు మాట్లాడుతూ, వీరిలో ఒక వ్యక్తి తనను తీవ్రస్థాయిలో దుర్భాషలాడి బెదిరించాడని ఆరోపించారు. తనపై దాడి చేసిన వ్యక్తులు మద్యం సేవించి వున్నారని, ఇక్కడి నుంచి వెళ్లకపోతే ఇక్కడే పాతేస్తానని బెదిరించారని చెప్పారు.

చెరకు డబ్బులకు నిరీక్షణ

... 3వ పేజీ తరువాయి

సుమారు 7 కోట్ల 45 లక్షల రూపాయలు ఇచ్చారు. వీరికి మిగిలిన రూ.419 (టన్నుకు) డబ్బులతోపాటు ఇతర రైతులకు లక్షా 41 వేల 801 టన్నులకు రూ.2,919 చొప్పున సుమారు రూ.43 కోట్లు చెల్లించాలి. ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తే చెరకు బకాయిలు ఎంతకాలానికి అందుతాయో చెప్పలేని విధంగా వుంది. ఈ సీజన్‌లో ఫ్యాక్టరీ లక్షా 45వేల క్వింటాళ్ల పంచదారను ఉత్పత్తి చేసింది. ఇందులో 60 వేల క్వింటాళ్ల పంచదారను విక్రయించినట్టు సమాచారం. మిగిలిన పంచదార అమ్మకాలు పూర్తయితే తప్ప రైతులకు బకాయిలు అందే పరిస్థితి కనిపించడం లేదు. గత సీజన్‌లో చివరి విడత బకాయిలు రూ.12.5 కోట్లు ఇవ్వడానికి వైసీపీ ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ నాలుగు నెలలు వెళ్లబుచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

పెందుర్తి నియోజకవర్గం

భరణికంలో పరదేశిమాంబ పండగ రేపు



పరవాడ, మార్చి 31 : మండలంలోని భరణికం గ్రామస్థుల ఆరాధ్య దేవత పరదేశిమాంబ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేపట్టింది. ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వలస వెళ్లిన వారంతా ఈ వేడుక నిమిత్తం గ్రామానికి తిరిగి వస్తుండడంతో సందడి వాతావరణం నెలకొంది. గ్రామంలోని ప్రతి వీధి విద్యుద్దీపాలంకరణలో ధగధగలాడుతున్నాయి.

పోలింగ్ బూత్‌లలో ఓట్ల పరిశీలన

సబ్బవరం, మార్చి 31 :మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మన పోలింగ్ బూత్- మన ఓటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమకు ఓటు ఉన్నదీ లేనిదీ సరిచూసుకున్నారు. సబ్బవరం పోలింగ్ స్టేషన్లు 34, 36, 37లను సెక్టార్ ఆఫీసర్ హిమబిందు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సూపర్‌వైజర్ పూడి శేషు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



సబ్బవరం కేథలిక్ చర్చిలో ఫాదర్ల ప్రార్థనలు

సబ్బవరం, మార్చి 31 : మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు చర్చిల్లో ప్రార్థనలు జరిపారు. సబ్బవరం కేథలిక్ చర్చిలో ప్యారిష్ ప్రీస్ట్ థామస్ పులికల్, ఫాదర్ కళ్యాణ్ ఆధ్వర్యంలో క్రీస్తు విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రార్థించారు. ప్యారిస్ కౌన్సిల్ సభ్యులు పి. మాణిక్యాలరావు, పీటర్ ఆడారి నాగరాజు, ఎస్. గణేశ్, ధనుంజయ్, జోసెఫ్, అప్పారావు, చంటి, బ్రిజిటన్ సిస్టర్స్ ఆలీస్, పుష్ప, సునీత, విజయప్రియ, ఫ్లోర, లీన పాల్గొన్నారు.

ఉక్కు సమస్యలపై సీఎం రమేశ్‌కు వినతి



వినతి పత్రం అందిస్తున్న నాయకులు

కొత్తూరు, మార్చి 31 : స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ కాకుండా చూడాలని సంసకు చెందిన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పలువురు బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం అనకాపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంటు ప్రైవేటీకరణ, పీఎఫ్ తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు.

ఎలమంచిలి నియోజకవర్గం



నిర్మానుష్యంగా ఉన్న ఎలమంచిలి ప్రధాన రోడ్డు జంక్షన్

మండుతున్న ఎండలు

ఎలమంచిలి, మార్చి 31: ఎండలు మండుతున్నాయి. ఒక్కసారిగా తీవ్రత పెరగడంతో నిత్యం రద్దీగా ఉండే కూడళ్లు, రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. వారం రోజులుగా 11 గంటలు దాటితే చాలు ఎండ ధాటికి తట్టుకోలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. వ్యాపార సముదాయాలు, మార్కెట్‌లో వినియోగదారులు తగ్గుముఖం పట్టడంతో సందడి తగ్గుతోంది. రోడ్లపై సైతం జనంతో పాటు వాహనాలు సంచరించడం లేదు. వేసవి ఆరంభంలోనే ఎండలు ఇంత దారుణంగా ఉంటే, రానున్న రోజుల్లో పరిస్థితి ఇంకెంత భయానకంగా ఉంటోందనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పోలింగ్ స్టేషన్లలో బోర్డుల ఏర్పాటు

ఎలమంచిలి, మార్చి 31: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలోని పోలింగ్ స్టేషన్ల వద్ద నంబరుతో పాటు బీఎల్వోల సమాచారం తెలియపరిచేలా బ్లాక్ పెయింట్‌తో పేర్లు నమోదు చేస్తున్నారు. పట్టణంలోని పోలింగ్ స్టేషన్‌ల వద్ద బీఎల్వోల పరిధిలో ఉండే పోలింగ్ కేంద్రాల వద్ద పెయింటింగ్ బోర్డులు జోరుగా ఏర్పాటు చేస్తున్నారు. చేయిస్తున్నారు. ఓటు వేసేందుకు వచ్చిన వారికి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

చోరీల నియంత్రణకు మైక్ ప్రచారం



దిమిలి రోడ్డు జంక్షన్ మైక్ ప్రచారం చేస్తున్న పోలీసులు

ఎలమంచిలి, మార్చి 31: వేసవిని దృష్టిలో ఉంచుకుని చోరీలు జరుగకుండా ఉండేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ పట్టణ పోలీసులు పురవీధుల్లో ఆదివారం మైక్ ప్రచారం చేపట్టారు. చోరీలు జరిగే తీరు, నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండడంతో పాటు ఏమాత్రం అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు ముందుస్తు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఏఎస్ఐ చెల్లారావు సూచించారు. అలాగే ఇళ్లు విడిచి వేరే ప్రాంతాలకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బీసీలకు న్యాయం జరిగింది టీడీపీ ప్రభుత్వంలోనే..

- తెలుగుదేశం పార్టీ పేట అభ్యర్థి వంగలపూడి అనిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి వనతి

పాయకరావుపేట రూరల్, మార్చి 31: బీసీలకు న్యాయం జరిగింది తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనేనని పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని వెంకటనగరం, రాజానగరం, శ్రీరాంపురం గ్రామాలలో ఆదివారం సాయంత్రం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం మేనిఫెస్టోలోని సూపర్-6 పథకాలపై ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే, అది కేవలం తెలుగుదేశం ప్రభుత్వంలోనేనని చెప్పారు. మత్స్యకారులు వలస పోవడం వల్ల వారి పిల్లలు చదువుకోసం ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కోసం బీసీ సంక్షేమ వసతి గృహాన్ని కట్టిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మత్స్యకారులకు 50 సంవత్సరాలకే పింఛన్ తీసుకువచ్చిన ఘనత చంద్రబాబునాయుడిదేనన్నారు. పరిశ్రమలలో స్థానికులకు ఉద్యోగాలు వచ్చేలా చూస్తామన్నారు. టీడీపీ హయాంలో మత్స్యకారులకు జీపీఎస్ ట్రాకింగ్, ఎల్ఈడి బల్బులు, వలలు, తెప్పలు, నెట్ వెండింగ్ భవనాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక వల ఇచ్చారా అని ప్రశ్నించారు. ఏపీలో ఉన్న మద్యం దేశంలో ఎక్కడా దొరకదని, ఇక్కడ అంతా కల్తీ మద్యమేనని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు నానాజీ, వి.రమణ, సర్పంచులు వి.వెంకటరమణ, జి.కృష్ణప్రసాద్, నాయకులు జి.రాజుబాబు, వై.వరహాలు, చిక్కాల శ్రీను, పి.విలియంకేరీ, వంకా శివ, ఎం.రమాకుమారి, సిహెచ్.ప్రదీప్, అప్పారావు, కాశీవిశ్వనాథ్, రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ పండగ

కోటవురట్ల/రాంబిల్లి/అచ్యుతాపురం, మార్చి 31: ఈస్టర్ పండగను అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. కోటవురట్ల, అచ్యుతాపురం, రాంబిల్లి తదితర మండలాల్లోని క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ఈస్టర్ కార్యక్రమం నిర్వహించారు. కోటవురట్లలోతని ప్రార్థనా మందిరాలు క్రైస్తవ భక్తులతో కిటకిటలాడాయి. క్రైస్తవుల కుటుంబీకులు మరణించి సమాధులను రంగు రంగులు, వివిధ రకాల పువ్వులతో అలకరించారు. ఆదివారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో సమాధులను సందర్శించి, క్యాడిల్స్ వెలిగించి ఘనంగా నివాళులర్పించారు. అలాగే క్రైస్తవుల ఇళ్ల వద్ద రుచికరమైన వంటకాలు తయారు చేసుకోవడంతో పాటు కొత్త వస్త్రాలు ధరించి చర్చిలకు వెళ్లి ఆనందోత్సాహాలతో గడిపారు. రాంబిల్లి మండలంలో పలు గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవ భక్తులు ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బైబిల్ సందేశాన్ని భక్తులకు తెలియజేశారు. అనంతరం ఆయా చర్చిల పరిధిలో ఉన్న తమ కుటుంబీలు సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అచ్యుతాపురం మండలంలో ఈస్టర్ వేడుకలు జరిగాయి. చర్చిల్లో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు నిర్వహించారు. సంఘం పెద్దలు, పాస్టర్లు మట్ల ఆనందరాజ్, ఆర్ ప్రసన్నకుమార్, బుకాయేసుదాసు, మట్లసునాథ్‌బాబు, ఎస్.సాందీప్‌రాజు, ఆర్.నానిమణిమోహన్, సుధీర్‌కుమార్, జాషువారాయ్, సైమన్ పీటర్, జేమ్స్, హైజాక్, ఎన్.అప్పారావు, జాన్‌మోజెస్, పీటర్, జగదీష్‌పాల్, కాలేబ్, పాల్గొన్నారు.

నేటి నుంచి అచ్యుతాపురంలో ఐవోసీ సేవలు

విశాఖపట్నం (మల్కాపురం), మార్చి 31: విశాఖలోని మల్కాపురంలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ) రిఫైనరీ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం తరలిపోనుంది. దశాబ్దాలుగా మల్కాపురం శివారు పోర్టు స్థలంలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రిఫైనరీని తాజాగా అనకాపల్లి జిల్లా అచ్యుతాపురానికి తరలించారు. దీంతో పెట్రోల్, డీజిల్ తరలింపు ప్రక్రియ సోమవారం నుంచి అచ్యుతాపురం టెర్మినల్ నుంచే జరుగుతుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటి వరకు ప్రతి రోజూ మల్కాపురం ఐవోసీ నుంచే ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలతో పాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు పెట్రోల్, డీజిల్ తరలించేవారు. విదేశాల నుంచి వచ్చే నౌకలకు, స్థానికంగా ఉండే నౌకలకు ఇక్కడి నుంచే పెట్రోల్, డీజిల్ వెళ్తుండేది. ఈ క్రమంలో ఐవోసీని విస్తరించేందుకు అధికారులు అనేక ప్రయత్నాలు చేశారు. పక్కనే ఉన్న ఏకేసీ కాలనీని తరలించి పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసినప్పటికీ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని భావించి అచ్యుతాపురంలో కేంద్రం ఏర్పాటు చేశారు. పనులు పూర్తి కావడంతో సోమవారం నుంచి ఐవోసీ కార్యకలాపాలను అచ్యుతాపురంలో ప్రారంభించనున్నారు.

మల్కాపురంలో బ్లాక్ ఆయిల్ ఉత్పత్తులే...

ఇకపై మల్కాపురం ఐవోసీ రిఫైనరీని బ్లాక్ ఆయిల్ ఉత్పత్తుల తయారీకి మాత్రమే వినియోగిస్తారు. బ్లాక్ ఆయిల్ విభాగంలో ఎల్‌డీవో (లైట్ డీజిల్ ఆయిల్), ఎఫ్‌వో (ఫర్నిస్ ఆయిల్), ఏటీఎఫ్ (విమాన ఇంధనం) వంటివి మాత్రమే ఉత్పత్తి చేసి తరలిస్తారు.

గుడివాడలో వైసీపీకి భారీ షాక్

- వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు



టీడీపీలో చేరిన కార్యకర్తలో పార్టీ అభ్యర్థి అనిత తదితరులు

ఎస్.రాయవరం, మార్చి 31: మండలంలోని గుడివాడ పంచాయతీలో వైసీపీకి భారీ షాక్ తెగిలింది. ఈ పంచాయతీ పరిధిలోని గుడివాడ, లక్ష్మీపతి రాజుపేట, కొత్త పోలవరం గ్రామాల్లో ఉన్న వైసీపీకి చెందిన సుమారు 50 కుటుంబాలు ఆ పార్టీని వీడి, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటరాజు ఆధ్వర్యంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరినీ అనిత పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అందుకే ఆ పార్టీ నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొట్టా వరహాలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మామిడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ గెలుపునకు కృషిచేయాలి: మాజీ మంత్రి బూడి

పాయకరావుపేట, మార్చి 31: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషిచేయాలని డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు కోరారు. మండల కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం నాయకుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్న వారంతా తమను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నాయకులు చిక్కాల రామారావు, లక్ష్మీశివ కుమారి, ఎల్.సూరిబాబు, డి.బాబూరావు, డి.సాయిబాబా, డి.బాబి, తాతారావు, జగతా శ్రీను, చోడిపల్లి శ్రీను, దేవవరపు రాజేశ్‌ఖన్నా పాల్గొన్నారు.

పాయకరావుపేట నియోజకవర్గం

వేసవి సెగలతో ఉక్కిరిబిక్కిరి

నక్కపల్లి, మార్చి 31: ఈ ఏడాది మే నెలకు ముందే భానుడు సెగలు పుట్టిస్తున్నాడు. పది రోజుల నుంచి వేసవి తాపం కనబడుతోంది. ఆదివారం ఉదయం నుంచి ఎండ తీవ్రతతో పాటు వడగాడ్పులు కూడా వీచాయి. బయటకు వెళ్లిన వారంతా ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇప్పుడే ఎండల తీవ్రత ఇలా వుంటే... ఇక ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పరిస్థితి ఇంకెంత భయంకరంగా ఉంటోందనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వేడిగాలులు వీచాయి.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో గీతాంజలి

పాయకరావుపేట, మార్చి 31: మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పాయకరావుపేట ఆర్వో గీతాంజలి ఆదివారం పరిశీలించారు. అలాగే పట్టణంలోని తాండవ షుగర్స్ సమీపంలో పోలీసులు ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యల్లో భాగంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, చెక్‌పోస్టులు పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశామని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ సూర్యనారాయణ, సీఐ పి.అప్పలరాజు, ఆర్ఐ త్రినాథ్ పాల్గొన్నారు.

సూపర్-6 పథకాలపై ఉమ్మడి ప్రచారం



లింగాలతోట కాలనీలో ప్రచారం చేస్తున్న నాయకులు

పాయకరావుపేట, మార్చి 31: టీడీపీ సూపర్-6 పథకాలపై ఉమ్మడి పార్టీల నాయకులు ఆదివారం ప్రచారం నిర్వహించారు. పట్టణంలో లింగాలతోట కాలనీలోని పలువు వీధుల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, వార్డు సభ్యురాలు మంగాదేవి తదితరులు ప్రజలకు కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జూరెడ్డి ప్రసాద్, లెక్కల గోవిందు, డి.నాగు, బాబూరావు, ఎస్.సుబ్రహ్మణ్యం, పి.నాగవెంకటరమణ, నాయకులు బీఎస్.నారాయణ, శివలంక నాగమల్లి, బీజేపీ నాయకుడు కువల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడవులను కాపాడుకోకపోతే భవిష్యత్తులో నీరు దొరకదు

» ఏపీ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి


చిరంజీవి చౌదరికి టేకు ప్లాంటేషన్ గురించి వివరిస్తున్న రేంజ్ అధికారి

నర్సీపట్నం, మార్చి 31 : అడవులను కాపాడుకోలేకపోతే రానున్న రోజుల్లో నీరు దొరకని, విపత్కర పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుందని ఏపీ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు (ఏపీ పీసీసీఎఫ్) చిరంజీవి చౌదరి అన్నారు. ఆదివారం కేడీపేట రేంజ్ పరిధిలోని ఎం.నల్లగొండ గ్రామస్థులతో ఆయన మాట్లాడారు. అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పర్యటనలో భాగంగా మాకవరం, నల్లగొండ అటవీ ప్రాంతంలోని 1962, 63 నాటి 20 హెక్టార్లలోని టేకు ప్లాంటేషన్‌ను పరిశీలించారు. టేకు చెట్లు నరికించి డిపోనకు తరలించడానికి అనుమతి ఇచ్చారు. అనంతరం గొలుగొండ కలప డిపోను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి, అనకాపల్లి జిల్లా అటవీ అధికారి జగన్నాథ్‌సింగ్, చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ, పాడేరు డీఎఫ్‌వో వినోద్‌కుమార్, స్క్వాడ్ డీఎఫ్‌వో సోమసుందరం, రేజ్ అధికారులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ట్రాలీ టైర్లు, ఇంజన్ సామాన్లు చోరీ

» అనుమానితుడ్ని విచారిస్తున్న పోలీసులు


ట్రాలీ టైర్లతో సహా డ్రమ్ములను అపహరించిన దృశ్యం

రావికమతం, మార్చి 31: అధికారులు సీజ్ చేసి దొండ పూడి ఫారెస్ట్ ఠాణా వద్ద గత రెండేళ్లుగా ఉంచిన గ్రానైట్ లోడుతో ఉన్న హెవీ ట్రాలీలు, వీటి ఇంజన్ సామాన్లు చోరీకి గురయ్యాయి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు బిజీగా ఉండడంతో కోటపాడుకు చెం దిన ఒక దొంగ, దొండపూడికి చెందిన మరో యువకుడి సహాయంతో ఇటీవల చోరీకి పాల్పడినట్టు తెలిసింది. ట్రాలీ యజమానుల సమాచారంతో రంగంలోకి దిగిన కొత్తకోట పోలీసులు దీనిపై విచారణ చేసి ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తు న్నారు. దీనిపై కొత్తకోట ఎస్‌ఐ లక్ష్మణరావును వివరాలు కోరగా ఇప్పటికే విచా రణ చేస్తున్నామని, దొండపూడి, కోటపాడు, చోడవరం గ్రామాలకు చెందిన వ్యక్తులు ఈ చోరీకి పాల్పడినట్టుగా ప్రాథమిక సమాచారం అందడంతో ఆ దిశగా వారిలో ఒక యువకుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నామ న్నారు. ఈ చోరీపై త్వరలోనే పూర్తిస్థాయి వివరాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండుగ


ఘటాలను ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

మాడుగుల, మార్చి 31 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ ఘటాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి ఘటాలను తలపై ఊరేగింపుగా తీసుకు వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు విశేష అలంకరణలు జరిపి, పూజలు జరిపారు. దూర ప్రాంతాల నుంచి కుటుంబాలతో వచ్చినవారు వంటలు వండుకుని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన అనంతరం ఆరగించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెరకు డబ్బులకు నిరీక్షణ

... 3వ పేజీ తరువాయి

సుమారు 7 కోట్ల45 లక్షల రూపాయలు ఇచ్చారు. వీరికి మిగిలిన రూ.419 (టన్నుకు) డబ్బులతోపాటు ఇతర రైతులకు లక్షా 41 వేల 801 టన్నులకు రూ.2,919 చొప్పున సుమారు రూ.43 కోట్లు చెల్లించాలి. ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తే చెరకు బకాయిలు ఎంతకాలానికి అందుతాయో చెప్పలేని విధంగా వుంది. ఈ సీజన్‌లో ఫ్యాక్టరీ లక్షా 45 వేల క్వింటాళ్ల పంచదారను ఉత్పత్తి చేసింది. ఇందులో 60 వేల క్వింటాళ్ల పంచదారను విక్రయించినట్టు సమాచారం. మిగిలిన పంచదార అమ్మకాలు పూర్తయితే తప్ప రైతులకు బకాయిలు అందే పరిస్థితి కనిపించడం లేదు. గత సీజన్‌లో చివరి విడత బకాయిలు రూ.12.5 కోట్లు ఇవ్వడానికి వైసీపీ ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ నాలుగు నెలలు వెళ్లబుచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

రెచ్చిపోయిన గ్రావెల్ మాఫియా

... 3వ పేజీ తరువాయి

పోలీసు స్టేషన్‌కు వెళ్లి.. పుణ్యమంతుల సంజీవి, యలమంచిలి దుర్గాప్రసాద్, మనబాల గణేశ్, పిక్కి బుజ్జి, రావి రాజులు తనపై దాడిచేసినట్టు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ విజయ్‌కుమార్ వీరి పై కేసు నమోదు చేశారు. ఈ సంద ర్భంగా ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రీనుబాబు మాట్లాడుతూ, వీరిలో ఒక వ్యక్తి తనను తీవ్రస్థాయిలో దుర్భా షలాడి బెదిరించాడని ఆరోపించారు. తనపై దాడి చేసిన వ్యక్తులు మద్యం సేవించి వున్నారని, ఇక్కడి నుంచి వెళ్లకపోతే ఇక్కడే పాతేస్తానని బెదిరించారని చెప్పారు.


గ్రావెల్ తవ్విన ప్రదేశం

ఆశలు అవుట్!

... 3వ పేజీ తరువాయి

ఉద్యోగులకు రూ.18 వేల నుంచి రూ.38 వేల వరకు వేతనం లభిస్తోంది. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి ఉంటే.. రెగ్యులర్ ఉద్యోగులకు లభించే వేతనం దక్కేది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ.24 వేలు చెల్లిస్తున్నారు. కనీస వేతనాల హామీ అమలైతే రూ.30 వేలకుపైగా లభించేదని చెబుతున్నారు. అదే సమయంలో ఈ రెండు కేటగిరీల్లో ఉద్యోగ భద్రత ఉండేదంటున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలయ్యేదని పేర్కొంటున్నారు.

కేంద్ర పథకమంటూ దాటవేత

కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని అమలుచేయాలని ఉద్యోగులు కోరితే.. ప్రభుత్వ పెద్దలు భిన్నమైన వాదనను తెరపైకి తీసుకు వచ్చారని చెబుతున్నారు. సమగ్ర శిక్ష అభియాన్, నేషనల్ హెల్త్ మిషన్ వంటి స్కీమ్‌లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలుచేస్తున్నాయని, వీటిలో పని చేసే వారిని రెగ్యులరైజ్ చేయలేమని ప్రభుత్వం స్పష్టం చేసిందంటున్నారు. పాదయాత్ర సమయంలో ఈ అంశాలపై జగన్‌కు అవగాహన ఉన్నప్పటికీ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తరువాత మాట మారుస్తున్నారని ఉద్యోగులు మండిపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అమలుచేస్తున్న పథకాల్లోనే సుమారు నాలుగు వేల మంది వరకు కాంట్రాక్టు ఉద్యోగులున్నారని, వారందరినీ మభ్య పెట్టి.. ఈ తరహా వ్యాఖ్యలు చేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వేసవి ఆరంభంలోనే అవస్థలు

» ఎరకన్నపాలేన్ని వెంటాడుతున్న తాగు నీటి కష్టాలు » నీటి పథకం ఉన్నా పనిచేయని బోరు
» 'జల్ జీవన్'లో భాగంగా చేపట్టిన తవ్వకాలతో అప్పటి వరకు ఉన్న పాత పైప్‌లైన్ పలుచోట్ల మరమ్మతులు
» పట్టించుకోని అధికారులు » ఎండలు మండుతుండడంతో వెంటనే స్పందించాలని అంతా వేడుకోలు


మోటారు పాడవ్వడంతో ఉత్సవ విగ్రహంలా ఉన్న వాటర్ ట్యాంక్


గ్రామంలోని చేతిబోరు వద్ద నీటిని తోడేందుకు వచ్చిన మహిళలు


బావి వద్ద తమ సమస్యను వివరిస్తున్న మహిళలు

మాకవరపాలెం, మార్చి 31 : వేసవి ఆరంభంలోనే మండలంలోని రాచపల్లి శివారు ఎరకన్నపాలెం గ్రామస్థులు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెలరోజులుగా ఈ సమస్య ఉన్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. ఫలితంగా ఇక్కడి మహిళల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. మెట్ట ప్రాంతం కావడంతో తరచూ ఈ సమస్య వెంటాడుతోంది. గ్రామంలో 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇక్కడ మూడు తాగు నీటి బోర్లతో పాటు ఒక మంచినీటి పథకం, ఒక నేలబావి ఉన్నాయి. గతంలో ఫ్లోరైడ్ వాటర్ ఉందంటూ ఒక బోరును అధికారులు మూసివేశారు. మంచినీటి పథకం ద్వారా కొంత మేర తాగునీరు అందించినా నివాసితులకు సరిపడేవికావు. దీంతో ఐదేళ్ల కిందట టీడీపీ హయాంలో అధికారులు గిడుతూరులో రూ.10 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. దీని ద్వారా పలు గ్రామాలకు పైప్‌లైన్లు వేశారు. ఎరకన్నపాలెంలోనూ ఈ సౌకర్యం కల్పించారు. ఇదిలావుంటే, గ్రామంలో ఉన్న మంచినీటి పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో పాటు బోరు పాడై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. దీనికితోడు టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన పైప్‌లైన్ ఆరుమాసాల క్రితం జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా చేపట్టిన తవ్వకాల వల్ల అక్కడక్కడా పాడైంది. దీంతో కుళాయిల నుంచి ఐదు రోజలకు ఒకసారి తాగు నీరు అందుతుందని వాపోతున్నారు. గత్యంతరం లేక బోర్లు, నేలబావిని ఆశ్రయిస్తున్నామన్నారు. కొందరు తాగునీటిని ప్రైవేటు వాటర్ ప్లాంట్ల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుని గొంతు తడుపుకుంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామంలో తాగు నీటి సమస్యను పరిష్కరించాల్సిందిగా అక్కడివారంతా కోరుతున్నారు.

జగన్ ఓడితేనే రాష్ట్రానికి మనుగడ

» టీడీపీ, వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..
» ఎమ్మెల్యే గణేశ్‌కు మాజీ మంత్రి అయ్యన్న సవాల్


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి అయ్యన్న

గొలుగొండ, మార్చి 31 : జగన్‌రెడ్డిని ఈ ఎన్నికల్లో ఇంటికి పంపితేనే రాష్ట్రానికి మనుగడ ఉంటుందని మాజీ మంత్రి, టీడీపీ నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలోని పప్పుశెట్టిపాలెంలో పలువురు యువకులతో పాటు ఇద్దరు గ్రామ వలంటీర్లు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సందర్భంగా ఆదివారం ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటైన సభలో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని ఆరోపించారు. మళ్లీ ఆంధ్రప్రదేశ్‌కు మంచి రోజులు రావాలన్నా, ప్రజల కష్టాలు పోవాలన్నా టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. టీడీపీ హయాంతో తాను మంత్రిగా చేసిన అభివృద్ధి, ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే గణేశ్‌కు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు ఆదపురెడ్డి గోపాలకృష్ణ, గెడ్డం నానాజీ, చిటికెల సాంబమూర్తి, సుర్ల బాబ్జి, గెడ్డం ఆనంద్, రాయపురెడ్డి అప్పలనాయుడు, బెల్లపు కొండలరావు, కొల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి'


మల్లాంలో మాట్లాడుతున్న రాజు, చిత్రంలో తాతాయ్యబాబు

బుచ్చెయ్యపేట, మార్చి 31 : చంద్రబాబుతోనే ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మండలంలోని మల్లాం గ్రామంలో ఆదివారం వైసీపీ నుంచి టీడీపీలో 25 కుటుంబాలవారు చేరడంతో వారికి రాజు కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఒక్కఛాన్సు అంటూ అక్కడ జగన్‌మోహన్‌రెడ్డి, ఇక్కడ కరణం ధర్మశ్రీ అందలమెక్కి జనాన్ని కష్టాల్లోకి నెట్టారన్నారు. వ్యవసాయానికి నిరంతరంగా తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు గొప్పగా ప్రచారం చేసిన సీఎం జగన్, ఆరు గంటలు కూడా సరఫరా చేయలేక పోయారని ఎద్దేవా చేశారు. టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తాతయ్యబాబు, నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, గొలగాని శ్రీనివాసరావు, రాజారావు, వియ్యపు అప్పారావు, వెలంకాయల అప్పలనాయుడు, ఎం.బాబ్జి, కె.సత్యనారాయణ, కోరుకొండ రవికుమార్, దేవర తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : మండలంలోని కొమరవోలు, పడాలపాలెం, జానకిరాంపురం తదితర గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు గుములూరు చంద్రమౌళి, బలిజి మహారాజు, కర్రి తమ్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల టీడీపీ టికెట్‌పై పునరాలోచన చేయాలి

» నాలుగు మండలాల్లో పలువురు పార్టీ శ్రేణులు ర్యాలీ


దేవరాపల్లిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

మాడుగుల/చీడికాడ/దేవరాపల్లి/కె.కోటపాడు, మార్చి 31 : టీడీపీ మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం టికెట్టు విషయమై పార్టీ అధిష్ఠానం పునరాలోచన చేయాలని కోరుతూ మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల్లోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆదివారం భారీ బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గవిరెడ్డి రామానాయుడికి టిక్కెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలిపించి, చంద్రబాబుకు కానుకగా ఇస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడాకారులకు స్పోర్ట్స్ మ్యాట్స్ వితరణ


స్పోర్ట్ మ్యాట్స్ అందజేస్తున్న నారాయణరావు

నర్సీపట్నం, మార్చి 31 : ఇక్కడి ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని నింజాస్ అకాడమీలో వూషూ, బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారుల కోసం రూ.50వేలు విలువ చేసే 45 స్పోర్ట్స్ మ్యాట్స్‌ను వెలగా నారాయణరావు కోచ్ యర్రా శేఖర్‌కు ఆదివారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో విద్యార్థులు రాణించాల్సిందిగా ఆకాక్షించారు.

ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం

» విస్తృతంగా వాహన తనిఖీలు » గ్రామాల్లో కేంద్ర బాలగాలతో కవాతు


రాజాం కూడలిలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ ఈశ్వరరావు

బుచ్చెయ్యపేట, మార్చి 31 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. రాజాం పోలీసు చెక్ పోస్టు వద్ద ఆదివారం ఎస్‌ఐ డి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ తగిన ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తీసుకు వెళ్లరాదన్నారు.


కృష్ణాదేవిపేటలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

గొలుగొండ : మండలంలోని ఏఎల్‌పురం, కృష్ణాదేవిపేట, కొంగశింగి, చోద్యం తదితర గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాలు ఆదివారం ఫ్లాగ్ మార్చి నిర్వహించాయి. ఈ సందర్భంగా నర్సీపట్నం రూరల్ సీఐ హరి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలంతా సహకరించాల్సిందిగా కోరారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాదేవిపేట ఎస్‌ఐ ఎం.ఉపేంద్రతో పాటు స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

నర్సీపట్నం, మార్చి 31 : ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ప్రవేశాల నిమిత్తం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పెంచిందని ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయకర్త వీవీ రాజేంద్ర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నర్సీపట్నం పెదబొడ్డేపల్లిలో గల బాలుర రెసిడెన్షియల్ స్కూల్, అచ్యుతాపురం బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లలో ఐదో తరగతిలో పూర్తి సీట్లు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతులలో మిగులు సీట్లలో ప్రవేశాల కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. తొలుత మార్చి 31 వరకు గడువు విధించగా, దానిని ఏప్రిల్ ఐదో తేదీ వరకు పొడిగించినట్టు వివరించారు. అయితే ప్రవేశ పరీక్ష తేదీలో మాత్రం ఎటువంటి మార్పు లేదని స్పష్టం చేశారు.

'వలంటీర్లను పక్కన పెట్టడం బాధాకరం'

నాతవరం, మార్చి 31 : గొలుగొండపేటలో వైసీపీ మండల ముఖ్య నేతల సమావేశం ఆదివారం ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేశ్ మాట్లాడుతూ వలంటీర్లను పక్కన పెట్టడం బాధాకరమన్నారు. నియోకవర్గ అభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. ఎన్నికల్లో వైసీపీకి ఓటర్లు మళ్లీ పట్టం కట్టేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. నాయకులు పైల పోతురాజు, మైనం నాగగోపీ, లగుడు నాగేశ్వరరావు, గొర్లి వరహాలబాబు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ మృతదేహానికి అంత్యక్రియలు

మాకవరపాలెం, మార్చి 31 : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై చికిత్స పొందుతూ మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ మృతదేహానికి ఆదివారం మండలంలోని నగరం గ్రామంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మాకవరపాలెం మండలం నగరం గ్రామానికి చెందిన డి.శ్రీనివాసరావు అనకాపల్లి జిల్లాలోని డీసీఆర్‌బీలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించేవారు. లంకెలపాలెంలో విధి నిర్వహణలో ఉండగా ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురయ్యారు. విశాఖపట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ శనివారం మృతి చెందడంతో స్వగ్రామంలో అంత్యక్రియలు జరిపారు. కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ఎస్‌ఐ రామకృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.


హెచ్‌సీ శ్రీనివాసరావు మృతదేహానికి పోలీసు లాంఛనంతో అంత్యక్రియలు

దేవరాపల్లి సంతలో చింతపండుకు భలే గిరాకీ

» పది కిలోలు రూ.600 నుంచి 650 వరకు విక్రయం


సంతో విక్రయానికి తెచ్చిన చింతపండు

దేవరాపల్లి, మార్చి 31 : ఇక్కడి వారపు సంతలో ఆదివారం చింతపండుకు మంచి గిరాకీ ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి రైతులు ఉదయం ఏడు గంటలకే మార్కెట్‌కు చింతపండును తీసుకువచ్చారు. పది కిలోల చింతపండు రూ.600 నుంచి 650 వరకు అమ్ముడైంది. నాణ్యమైన బొట్ట రావడంతో వ్యాపారులు క్షణాల్లో కొనుక్కొని వెళ్లిపోయారు. ఏడాదికి సరిపడా చింతపండు కొనుగోలు చేసి నిలవ ఉంచుకోవడానికి దూర ప్రాంతాల నుంచి సైతం పలువురు విచ్చేయడం విశేషం. దేవరాపల్లిని ఆనుకొని ఉన్న అనంతగిరి మండలానికి చెందిన నాలుగు గిరిజన పంచాయతీలు, దేవరాపల్లి మండలానికి చెందిన నాలుగు గిరిజన పంచాయతీలతో పాటు మైదాన ప్రాంతాలైన నాగయ్యపేట, కాశీపురం సీతంపేట నందిపల్లి, వెంకటరాజపురం, వాకపల్లి తదితర గ్రామాల నుంచి రైతులు ఆటోల్లో చింతపండును తీసుకువచ్చారు. సుమారు రెండు వేల టన్నుల వరకు చింత పండు మార్కెట్‌కు వచ్చింది. అనకాపల్లి, కొత్తవలస, చోడవరం, కె.కోటపాడు, వేపాడ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు పెద్ద సంఖ్యలో విచ్చేసి కొనుగోలు చేశారు. రైతులు మంచి ధర దక్కిందన్న ఆనందంతో ఇంటిముఖం పట్టారు.



నూకాలమ్మ జాతరకు ముహూర్తపు రాట


ముహూర్తపు రాట వేస్తున్న భక్తులు

మాడుగుల, మార్చి 31 : మండల కేంద్రం మాడుగుల శివారు నూకాలమ్మ కాలనీలో ఈ నెల ఎనిమిదో తేదీన నూకాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ముహూర్తపు రాట వేసి పూజలు జరిపారు. అనంతరం గ్రామంతో దండోరా వేయించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

'సృజనవాణి'లో పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

మాడుగుల రూరల్, మార్చి 31 : మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో గల సృజనవాణి స్వచ్ఛంద సంస్థలో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్టుకు హాజరు కానున్న విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ కో-ఆర్డినేటర్లు గ్యానీ, రామారావు తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఏప్రిల్ 25వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు ఈ తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థులకు ముందస్తుగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి, అందులో అర్హత సాధించిన ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ ఎంపిక కోసం ఏప్రిల్ ఒకటో తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా సూచించారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

బుచ్చెయ్యపేట, మార్చి 31 : చినప్పన్నపాలెంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పశువులను కోల్పోయిన బాధిత రైతు దొండా గణేశ్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ధర్మశ్రీ ఆదివారం పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వడ్డాది పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ కోవెల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ అభ్యర్థి వంశీకృష్ణ

... 3వ పేజీ తరువాయి

బీజేపీ కూటమి మధ్య సీట్ల అవగాహన మేరకు దక్షిణ నియోజకవర్గం జనసేనకు కేటాయించడంతో వంశీకృష్ణ పోటీచేస్తారని తొలుత ప్రకటించారు. అయితే ఇటీవల రాష్ట్రంలో జనసేన పోటీచేసే 21 స్థానాలకు గాను 18 మంది అభ్యర్థులతో విడుదల చేసిన జాబితాలో వంశీ పేరు లేకపోవడంతో ఉత్కంఠ నెలకొంది. అయితే ఆదివారం పిఠాపురంలో ఉన్న పవన్ కల్యాణ్ పార్టీ ముఖ్యనేతలతో చర్చించి, దక్షిణ టికెట్‌ను వంశీకి ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి అభ్యర్థులను ప్రకటించినట్టయింది.